**2-36**

## మున్నుడి

గరుడాచలమున (అహోబిలమున) వెలసిన నరసింహస్వామి, వేంకటేశ్వరుడే అని భావించి అన్నమాచార్యులవారు ఎన్నో మధురసంకీర్తనలు పాడారు. ఇలవేలుపైన ఆ నృసింహుని కీర్తనలు జనబాహుళ్యంలో గొప్పఆదరణను కూడా పొందాయి. 'అరుదుగా' అనే పదాన్ని నేటికాలంలో మనం 'అప్పుడప్పుడు' అనే భావనతో వుపయోగిస్తాం. కానీ 'అరుదుగా' అంటే 'అత్యద్భుతంగా' అని అర్థం. నృసింహుడు అరుదుగా కాచే అనంతుడు అన్నారు ఆచార్యులవారు. అవధరించండి...

**ఆ.వె॥కంటిమితనినేడె గరుడాచలంబున**
**ఇంటివేయిపయిన ఈశ్వరుడిని**
**పనిచి అన్నమయ్య ప్రహ్లాదవరదుని**
**వేంకటేశుడనుచ వినుతిజేసె.**

**రాగం : శుద్ధధన్యాసి**

కంటిమి నేడిదె గరుడా చలపతి
యింటి వేలుపగు యీశ్వరుడితడు. ॥కంటిమి॥

శ్రీనరసింహుడు చిన్మయ కాంతుడు
దానవాంతకుడు దయానిధి
నానామహిమల నమ్మిన వారిని
వూనక కాచే పోషకుడితడు ॥కంటిమి॥

దేవాదిదేవుడు దినకరతేజుడు
జీవాంతరంగుడుశ్రీవిభుడు
దైవ శిఖామణి తలచినవారికి
సేవలుగొనికాచే విభుడితడు ॥కంటిమి॥





పరమమూర్తి హరి ప్రహ్లాదవరదుడు
కరుణానిధి బుధకల్పము
పరగు శ్రీవేంకటపతి తనదాసుల-
నరుదుగ కాచే అనంతుడితడు. ॥కంటిమి॥

**భావామృతం :**

నేడు ఈ గరుడాద్రిపై అహోబిల నరసింహస్వామిని చూచుచున్నాము. ఈ నృసింహుడు మనందరికి ఇలవేలుపు. మనల్నిరక్షించే సర్వేశ్వరుడు ఈ మహానుభావుడే.

ఈ శ్రీనృసింహుడు చిన్మయమూర్తి అయిన ప్రభువు. ఈయన దానవులను మట్టుబెట్టుటకై అవతరించిన దయాసముద్రుడ.తననే నమ్ముకొని 'అన్యథాశరణంనాస్తి' అని శరణు వేడినవారిని రకరకములైన మహిమలను చూపి, పూనుకొని రక్షించే సర్వజన పోషకుడు. (ఈ స్వామిని ఆశ్రయించండి)

ఈ నృసింహుడు దేవతలందరికీ ఆరాధ్యదైవం. సూర్యకాంతితో వెలుగులు విరజిమ్మే తేజోమూర్తి. జీవులందరికీ అంతరాత్మగానున్నవాడు ఈ లక్ష్మీకాంతుడే. దేవతలందరికీ ఈయన శిరోమణివలె ప్రసిద్ధిజెందియున్నాడు. తననే ధ్యానించువారిని, సేవించువారిని కాపాడే వాడే ఈ జగన్నాథుడు. (ఈ మహానుభావుని ఆర్తితో వేడుకోండి)

ప్రహ్లాదుని రక్షించుటకే అవతరించిన ఈ దివ్యమూర్తి పరమమొసగుమూర్తి. ఈయన కరుణానిధి. జ్ఞానమూర్తులయిన పండితులకు ఈ స్వామి కల్పవృక్షము వంటివాడు. ఈయనే తిరుమల కొండపై శోభిల్లు శ్రీవేంకటేశ్వరుడు కూడా. ఈయన తనకు దాసులైన తన భక్తులను అత్యద్భుతముగా కాపాడు అనంతుడు (ఎన్నటికీ అంతము లేని వాడు) ఈయనను శరణని తరించండి.

# 87. కంటిమి నేడిదె

V. 4-504

కంటిమి నేడిదె గరుడాచలపతి
యింటి వేలుపగు యీశ్వరుడితడు ॥

శ్రీ నరసింహుడు చిన్మయకాంతుడు
దానవాంతకుడు దయానిధి
నానా మహిమల నమ్మిన వారిని
పూనుక కాచే పోషకుడితడు ॥

దేవాది దేవుడు దినకర తేజుడు
జీవాంతరంగుడు శ్రీవిభుడు
దైవ శిఖామణి తలచిన వారిని
సేవలుగొని కాచే విభుడితడు ॥

పరమమూర్తి హరి ప్రహ్లాద వరదుడు
కరుణానిధి బుధకల్పము
పరగు శ్రీ వేంకటపతి తనదాసుల
నరుదుగ కాచే అనంతుడితడు ॥

* * *